

కాంచీపురం సిప్కాట్‌లో 'బిగ్ టెక్'

రూ.1003 కోట్లతో గొరిల్లా గ్లాస్ తయారీ కర్మాగారం

సీఎం స్టాలిన్ సమక్షంలో ఒప్పందం



సచివాలయంలో సీఎం స్టాలిన్ సమక్షంలో ఒప్పందం కుదుర్చుకుంటున్న రాష్ట్ర గైడెన్స్, బిగ్-టెక్ ప్రతినిధులు

చెన్నై, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం సిప్కాట్ - పిళ్లైపాక్కం ఇండస్ట్రియల్ పార్క్‌లో భారత్ ఇన్నోవేటివ్ గ్లాస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్- బిగ్‌టెక్ సంస్థ రూ.1003 కోట్ల పెట్టుబడితో అంతర్జాతీయ స్థాయి ఎలక్ట్రానిక్స్ వస్తువులకు ఉపయోగపడే గొరిల్లా గ్లాస్ తరహా వస్తువులను తయారీ కర్మాగారాన్ని నెలకొల్పనుంది. ఈ మేరకు సచివాలయంలో మంగళవారం ఉదయం ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సమక్షంలో రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మార్గదర్శక విభాగం 'గైడెన్స్', బిగ్- టెక్ ప్రతినిధులు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ కర్మాగారం ద్వారా 840 మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని ముఖ్యమంత్రి తెలిపారు. బిగ్-టెక్ సంస్థ అమెరికాకు చెందిన కార్నింగ్ ఇంటర్నేషనల్ కార్పొరేషన్, భారతదేశానికి చెందిన ఆప్టిమస్ ఇన్‌ఫ్రాకాం లిమిటెడ్ సంస్థల భాగస్వామ్య సంస్థగా ఉంటోందని ఆయన తెలిపారు. కార్నింగ్ ఇంటర్నేషనల్ సంస్థ సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లకు ఉపయోగించే 'కార్నింగ్ గొరిల్లా గ్లాస్‌లను ఉత్పత్తి చేస్తోందని, ఆప్టిమస్ ఇన్‌ఫ్రాకాం సంస్థ భారతదేశంలో సెల్‌ఫోన్ విడిభాగాలు, ల్యాప్‌టాప్‌ల తయారీలో పేరుగడించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామిక, వాణిజ్య శాఖలు, పెట్టుబడుల ప్రోత్సాహక శాఖల మంత్రి టీఆర్‌బీ రాజా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, పెట్టుబడుల ప్రోత్సాహక సంస్థ వాణిజ్య విభాగం కార్యదర్శి వి.అరుణ్‌రాయ్, గైడెన్స్ సంస్థమేనేజింగ్ డైరెక్టర్ వి.విష్ణు, ఆప్టిమస్ ఇన్‌ఫ్రాకామ్ సంస్థ చైర్మన్ అశోక్‌కుమార్ గుప్తా, కార్నింగ్ ఇండియా ఇన్నోవేటివ్ గ్లాస్ టెక్నాలజీస్ సంస్థ డైరెక్టర్ భావనా సింఘాల్, కార్నింగ్ ఇండియా సంస్థ బిజినెస్ హెడ్ దివ్యాంశు గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలు...

శివగంగ జిల్లా రాగిణిపట్టిలోని వేలునాచ్చియార్ స్మారక మండపం వద్ద స్వాతంత్ర్య సమరయోధురాలు కుయిలికి రూ.50 లక్షలతో చేపట్టనున్న విగ్రహ ప్రతిష్ఠాపనకు, శివగంగ జిల్లా నగరంపట్టిలో స్వాతంత్ర్య సమరయోధుడు వాలుక్కువేలి అంబళం త్యాగాన్ని గౌరవిస్తూ రూ.50లక్షలతో విగ్రహ ప్రతిష్ఠాపన పనులకు, తెన్‌కాశి జిల్లా నెర్‌కట్టుసెవల్ గ్రామంలో రూ.50లక్షలతో స్వాతంత్ర్య సమరయోధుడు వెన్ని కాలాడి విగ్రహ ప్రతిష్ఠాపన పనులకు కూడా శంకుస్థాపన చేశారు. శివగంగ జిల్లా విరాయల్ గ్రామంలో జాతిపిత గాంధీ, కామ్రేడ్ జీవాతో భేటి కావడాన్ని భావితరాలు స్మరించేలా రూ.3 కోట్లతో నిర్మించనున్న స్మారక మందిరానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తమిళ భాషాభివృద్ధి, సమాచార శాఖ మంత్రి సామినాథన్, సామాజిక సంక్షేమ శాఖ మంత్రి గీతా జీవన్, మత్స్యశాఖ మంత్రి అనితా ఆర్.రాధాకృష్ణన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, తమిళభాషాభివృద్ధి, సమాచార శాఖల కార్యదర్శి డాక్టర్ ఇరా సెల్వరాజ్, సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు డి.మోహన్, తమిళభాషాభివృద్ధిశాఖ సంచాలకులు ఎన్ అరుళ్ తదితరులు పాల్గొన్నారు.

సమరయోధులకు మండపాలు, విగ్రహాలు...

ఇదేవిధంగా సచివాలయంలో రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన మరో కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధులకు స్మారక మండపాలను, విగ్రహాలను సీఎం స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. మరికొందరు సమరయోధులకు విగ్రహాల తయారీ, ప్రతిష్ఠాపన పనులకు శంకుస్థాపన చేశారు. మంగళవారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమంలో తూత్తుకుడి జిల్లా కామనాయకన్‌పట్టి గ్రామం సెయింట్ మేరీ ఆలయ ప్రాంగణంలో కోటి రూపాయలతో 'తమిళ నిఘంటువు పితామహుడు' వీరమామునివర్ విగ్రహంతో కూడిన స్మారక మండపాన్ని, నామక్కల్ నగరంలోని నామక్కల్ కవి రామలింగం పిళ్లై స్మారక మండపంలో రూ.20లక్షలతో ప్రతిష్ఠించిన విగ్రహాన్ని, శివగంగ జిల్లా మహిపాలన్‌పట్టిలో 276.75 చదరపుటడుగుల విస్తీర్ణంలో రూ.23.26 లక్షలతో నిర్మించిన తమిళ పండితుడు కనియన్ పూంకుండ్రనార్ స్మారక స్తూపాన్ని ఆయన ప్రారంభించారు.

త్వరలో డీఎంకే అభ్యర్థుల ఎంపిక

మూడు కమిటీల కసరత్తు



అన్నా అరివాలయంలో డీఎంకే ఎన్నికల మేనిఫెస్టో తయారీ కమిటీ సభ్యులతో చర్చలు జరుపుతున్న ఆ కమిటీ ఇన్‌ఛార్జి కనిమొళి

చెన్నై, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలపై దృష్టిసారిస్తూ డీఎంకే అధిష్ఠానం ఏర్పాటు చేసిన మూడు కమిటీలు కసరత్తు ప్రారంభించాయి. ఓ వైపు ఎన్నికల సమన్వయ కమిటీ, మరో వైపు మిత్రపక్షాలతో చర్చలు జరపనున్న కమిటీ, ఇంకోవైపు ఎన్నికల మేనిఫెస్టో కమిటీ అంటూ మూడు కమిటీల సభ్యులు తేనాంపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో పదేపదే చర్చలు జరుపుతున్నారు. ఈ కమిటీలు ఏర్పాటై వారం రోజులు కూడా దాటకముందే లోక్‌సభ ఎన్నికల్లో ఏయే నియోజకవర్గాలు తమ గెలుపునకు అనువుగా ఉన్నాయనే విషయంపై ప్రత్యేక దృష్టి సారించాయి. అదే సమయంలో కూటమిలో కొత్త పార్టీలను చేర్చుకునే విషయంపై కూడా పార్టీ శ్రేణుల అభిప్రాయాలను అడిగి తెలుసుకుంటున్నాయి. ఈ మూడు కమిటీలే కాకుండా అభ్యర్థుల కమిటీ కూడా త్వరలో రంగంలోకి దిగనుంది. ఆ కమిటీలో డీఎంకే యువజన విభాగం నేత, మంత్రి ఉదయనిధికి చోటు లభించడంతో అభ్యర్థుల ఎంపికలో యువతకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంది. డీఎంకే కూటమిలో ప్రస్తుతం కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, డీపీఐ, ఎండీఎంకే, మనిదనేయ మక్కల్ కట్చి, తమిళగ వాళ్వురిమై కట్చి, కొంగునాడు మక్కల్ దేశీయ కట్చి మిత్రపక్షాలుగా ఉన్నాయి. ఈ కూటమిలోకి కమలహాసన్ నాయకత్వంలోని మక్కల్ నీదిమయ్యం కూడా చేరనుంది. మరికొన్ని పార్టీలు కూడా డీఎంకే కూటమిలో చేరేందుకు తహతహలాడుతున్నాయి. ఈ మిత్రపక్షాలతో చర్చలు జరిపేందుకు పార్టీ కోశాధికారి టీఆర్‌బాలు నాయకత్వంలో పార్టీ ముఖ్య కార్యదర్శి కేఎన్ నెహ్రూ, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు ఐ.పెరియసామి, పొన్ముడి, ఎ.రాజా, తిరుచ్చి శివా, ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం సభ్యులుగా ఉన్నారు. ఇక డీఎంకే ఎంపీ కనిమొళి నాయకత్వంలో ఏర్పాటైన ఎన్నికల మేనిఫెస్టో తయారీ కమిటీలో టీకేఎస్ ఇళంగోవన్, టీకేఎస్ విజయన్, పీటీఆర్ పళనివేల్ త్యాగరాజన్, టీఆర్‌బీ రాజా, కోవి చెళియన్, ఎంపీలు అబ్దుల్లా, రాజేష్‌కుమార్, ఎమ్మెల్యేలు ఎళిలరసన్, ఎళిలన్ సభ్యులుగా ఉన్నారు. ఇక పార్టీ వ్యవస్థాపక కార్యదర్శి ఆర్ఎస్ భారతి నాయకత్వంలోని ఎన్నికల పనుల సమన్వయ కమిటీలో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఇవీ వేలు, తంగం తెన్నరసు, ఉదయనిధి సభ్యులుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులు సోమవారం సాయంత్రం అన్నా అరివాలయంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పుదుచ్చేరి సహా 40 లోక్‌సభ నియోజకవర్గాలలో పార్టీ పరిస్థితులపై సమీక్షించారు. డీఎంకే సిట్టింగ్ ఎంపీల పనితీరు, ఆయా నియోజకవర్గాలలో వారి ప్రజాభిమానం, వ్యతిరేకత అంశాలపై చర్చించారు. అదే సమయంలో పార్టీకి చిరకాలం సేవలందించి ఎలాంటి పదవులు పొందని, స్థానికంగా పలుకుబడి కలిగినవారికి ఎంపీ టికెట్లు ఇచ్చే విషయంపై చర్చించారు. మిత్రపక్షాలు ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ నియోజవర్గాల్లో ప్రస్తుత పరిస్థితులు గురించి ఆ నియోజకవర్గాల్లో డీఎంకేకు ఉన్న బలం గురించి కూడా చర్చలు జరిపారు. ఇదే విధంగా మంగళవారం ఉదయం ఎంపీ కనిమొళి అధ్యక్షతన ఎన్నికల మేనిఫెస్టో తయారీ కమిటీ సభ్యుల సమావేశం కూడా జరిగింది. ఈ సమావేశంలో మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రకటించాల్సిన హామీలపై చర్చించారు. ఈ సమావేశానంతరం కనిమొళి మీడియాతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే మేనిఫెస్టో నాయకిగా ఉంటుందని పేర్కొన్నారు. ఆ మాటను బట్టి మహిళలకు డీఎంకే మరిన్ని తాయిలాలు ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది.

నేడు అభిప్రాయ సేకరణ...

ఇది ఇలా ఉండగా బుధవారం మధ్యాహ్నం నుంచి నియోజకవర్గాల వారీగా అభిప్రాయాల సేకరణ జరపనున్నారు. తొలి రోజు కృష్ణగిరి, తిరువళ్లూరు నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపికపై ఆ నియోజకవర్గాలకు చెందిన పార్టీ ఇన్‌ఛార్జులు, జిల్లా నేతలతో చర్చలు జరుపనున్నారు. ఆ తర్వాత ఈనెల 27న పొల్లాచ్చి, కోయంబత్తూరు, నీలగిరి, తిరుప్పూరు నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపికకు సంబంధించి అభిప్రాయాలను సేకరించనున్నారు. ఫిబ్రవరి 5వ తేదీ వరకు ఈ అభిప్రాయ సేకరణ జరుగుతుందని, ఆ తర్వాత డీఎంకే తరఫున పోటీ చేయనున్న నియోజకవర్గాలు, అభ్యర్థులు వివరాలను అధికారంగా ప్రకటిస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



జయ నగలన్నింటినీ ప్రభుత్వానికి అప్పగించండి

బెంగళూరు ప్రత్యేక కోర్టు ఆదేశం

అడయార్, జనవరి 23: దివంగత ముఖ్యమంత్రి జయలలితకు చెందిన బంగారు నగలను తమిళనాడు రాష్ట్రప్రభుత్వానికి అప్పగించాలని బెంగళూరు ప్రత్యేక కోర్టు ఆదేశించింది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా జయలలిత ఉన్న సమయంలో ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించారన్న కేసులో బెంగళూరులోని ప్రత్యేక కోర్టులో పదేళ్ల పాటు విచారణ సాగింది. ఈ కేసులో 2015లో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జాన్ మైఖేల్ డి కున్హా సంచలన తీర్పును వెలువరిస్తూ, జయలలిత, శశికళ, సుధాకరన్‌ను దోషులుగా తేల్చారు. ఆ తర్వాత హైకోర్టు, సుప్రీంకోర్టులలో అప్పీల్ చేశారు. చివరకు సుప్రీంకోర్టు జయలలితతో పాటు దోషులందరికీ నాలుగేళ్ల జైలుశిక్ష విధించింది. అయితే, జయ మృతితో ఆమె మినహా మిగిలిన వారంతా శిక్షాకాలాన్ని పూర్తి చేశారు. ఈ కేసులో జయ నివాసంలో స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, చెప్పులు, చీరలు, వాచీలు ఇలా ఖరీదైన వస్తువులన్నీ కర్ణాటక రాష్ట్ర ఖజానాలో భద్రపరిచారు. వీటన్నింటినీ తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించాలని కోరుతూ బెంగళూరుకు చెందిన ఆర్టీఐ కార్యకర్త టి.నరసింహమూర్తి... బెంగళూరు ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ న్యాయమూర్తి మోహన్ సమక్షంలో విచారణకు వచ్చింది. ఇరువర్గాల వాదనలు ఆలకించిన న్యాయమూర్తి తీర్పును వెలువరించారు. అక్రమాస్తుల కేసులో ప్రధాన ముద్దాయిగా ఉన్న జయ నివాసంలో స్వాధీనం చేసుకున్న అన్ని రకాల ఆభరణాలు, ఇతర సామాగ్రిని తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించాలని ఆదేశించారు. అలాగే, జయకు చెందిన స్థిర, చర ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయో తమిళనాడు రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ గుర్తించి ఆ వివరాలను తమిళనాడు ప్రభుత్వంతో పాటు కోర్టుకు తెలియజేయాలని ఉత్తర్వులు జారీచేశారు. అలాగే, బెంగళూరు ప్రత్యేక కోర్టులో జరిగిన ఈ కేసు విచారణ ఖర్చుల కోసం కర్ణాటక ప్రభుత్వానికి తమిళనాడు ప్రభుత్వం రూ.5కోట్లు చెల్లించాలని న్యాయమూర్తి మోహన్ ఆదేశించారు.

కిళంబాక్కం నుంచే ఆమ్నీ బస్సులు నడపాలి

రవాణా శాఖ మంత్రి శివశంకర్ ఆదేశం



పట్టినంబాక్కం డిపో వర్క్‌షాపును ప్రారంభిస్తున్న రవాణా శాఖ మంత్రి ఎస్ఎస్ శివశంకర్

చెన్నై, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆమ్నీ బస్సులన్నీ ఇకపై కిళంబాక్కం బస్‌స్టేషన్ వద్ద నున్న పార్కింగ్ ప్రాంతం నుంచే బయలుదేరాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎస్ఎస్ శివశంకర్ ఆదేశించారు. పట్టినంబాక్కంలోని బస్ డిపోలో మంగళవారం ఉదయం ఆయన వర్క్‌షాపును ప్రారంభించారు. ఆ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నట్లు రవాణా శాఖలో సిబ్బంది కొరతగా ఉన్నమాట వాస్తవమేనని, అందువల్ల ప్రస్తుతమున్న సిబ్బందిపై అదనపు పనిభారం పడుతున్నట్లు గుర్తించామన్నారు. డ్రైవర్ల ఎంపిక వ్యవహారంపై ఆచితూచి వ్యవహరించాల్సి ఉందని, సునిశిత శిక్షణ కలిగినవారినే డ్రైవర్లుగా నియమించడం సబబుగా ఉంటుందన్నారు. ఈనెల 25 నుంచి నాలుగు రోజులు వరుసగా సెలవు రోజులు కావటంతో నగరం నుంచి స్వస్థలానికి వెళ్లేవారి కోసం ప్రత్యేక బస్సులను నడిపే విషయంపై చర్యలు చేపడతామన్నారు. గత కొద్ది రోజులుగా ఆమ్నీ బస్సులు ఛార్జీలను విపరీతంగా పెంచాయని, ఈ విషయమై రవాణా సంస్థ ఉన్నతాధికారులు తనిఖీలు జరిపి భారీగా జరిమానా కూడా విధించారని చెప్పారు. ఈ పరిస్థితులలో బుధవారం నుంచి ఆమ్నీ బస్సులను కిళంబాక్కం నుంచే నడపాలని, కోయంబేడు నుంచి నడిపితే కఠిన చర్యలు చేపడతామని మంత్రి శివశంకర్ హెచ్చరించారు. కిళంబాక్కంలో 850 ఆమ్నీ బస్సులను నిలిపేందుకు అనువైన పార్కింగ్ స్థలం లేదని ఆ బస్సుల యజమానుల సంఘం నాయకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆమ్నీ బస్సులలో బుధవారం ప్రయాణించేందుకు టికెట్లు రిజర్వు చేసుకున్నవారంతా కోయంబేడుకు వెళ్లాలా? లేక కిళంబాక్కం బస్‌స్టేషన్‌కు వెళ్లాలో తెలియక అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు.

మహిళా విధానానికి గ్రీన్ సిగ్నల్

కొత్త పరిశ్రమలకు ఆమోదం

చెన్నై, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నూతన మహిళా విధానాన్ని అమలు చేసేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశం ఆమోదించింది. అదే విధంగా ఈనెల మొదటివారంలో నిర్వహించిన అంతర్జాతీయ పెట్టుబడిదారుల మహానాడులో కుదిరిన అవగాహన ఒప్పందాలకు ఆమోదం తెలపడంతోపాటు ఆయా కంపెనీలు, సంస్థలు వీలైనంత త్వరగా పరిశ్రమలు నెలకొల్పేలా, ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. ఆరేళ్లలోగా వన్ ట్రిలియన్ అమెరికన్ డాలర్ల ఆర్థిక పురోగతిని సాధించడానికి తదుపరి చర్యలు చేపట్టేందుకు, ఆ దిశగా ముఖ్యమంత్రి స్పెయిన్ తదితర దేశాలల్లో పర్యటించడానికి మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో 2001లో కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిన మహిళా విధానాన్నే ఇప్పటివరకూ అమలుపరిచామని, ఇకపై రాష్ట్ర మహిళా విధానాన్నే అమలు చేయడానికి మంత్రివర్గ సభ్యులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. రాష్ట్రంలో మహిళలకు ఉపాధి అవకాశాల పెంపు, దివ్యాంగులైన మహిళలకు విద్య, ఉపాధి అవకాశాల్లో అధిక ప్రాధాన్యం, అవసరమైతే మహిళా రిజర్వేషన్ల శాతం పెంపు అంటూ పలు అంశాలను ప్రతిపాదించే మహిళా విధానాన్ని పటిష్ఠంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. రాష్ట్రంలో మూడు కోట్ల మందిదాకా మహిళలుఉన్నారని, వారికి అధికారంలో అధిక భాగస్వామ్యం కల్పించాలని, పటిష్ఠమైన భద్రత కల్పించాలని చెప్పారు. ఈ మహిళా విధానం అమలైతే కళాశాల స్థాయిలో విద్యార్థినులకు ఆత్మరక్షణకు సంబంధించి వివిధ రకాల శిక్షణలను అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఏది ఏమైనప్పటికీ మహిళలకు అన్ని రంగాల్లోనూ అధిక ప్రాధాన్యం ఇచ్చి మహిళాభ్యుదయంలో రాష్ట్రం ప్రథమస్థానం పొందటానికి మంత్రులు, అధికారులు తీవ్రంగా పాటుపడాలని ముఖ్యమంత్రి స్టాలిన్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మంత్రులు దురైమురుగన్, ఐ.పెరియసామి, కేఎన్ నెహ్రూ, కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, గీతా జీవన్, తంగం తెన్నరసు, ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, పీకే శేఖర్‌బాబు, ఎం. సుబ్రమణ్యం, సామినాథన్, దామో అన్బరసన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా తదితరులు పాల్గొన్నారు.



మంత్రివర్గ సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

పని చేయని నేతలపై కఠిన చర్యలు

ఎంఎన్ఎం అధినేత కమలహాసన్ హెచ్చరిక



మక్కల్‌నీదిమయ్యం కార్యనిర్వాహక కమిటీ సభ్యులకు దిశా నిర్దేశం చేస్తున్న ఆ పార్టీ నాయకుడు కమలహాసన్

చెన్నై, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పార్టీకి సేవలందించడంలో బాగా వెనుకబడి, సోమరితనంతో ఉన్న నేతలపై కఠిన చర్యలు తీసుకుంటానని మక్కల్ నీదిమయ్యం (ఎంఎన్ఎం) అధినేత కమలహాసన్ హెచ్చరించారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, జిల్లా శాఖ నాయకులు ప్రచారాన్ని ముమ్మరంగా ప్రారంభించాలని పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం ఆళ్వార్‌పేటలో మక్కల్ నీది మయ్యం ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్య నిర్వాహక కమిటీ సమావేశంలో కమల్ ప్రసంగిస్తూ... లోక్‌సభ ఎన్నికల్లో ఏ కూటమిలో చేరాలనే విషయంపై త్వరలోనే తగు నిర్ణయం తీసుకుంటానని పేర్కొన్నారు. అదే విధంగా నియోజకవర్గాల వారీగా బూత్‌కమిటీల ఏర్పాటుపై జిల్లా శాఖ నాయకులు దృష్టి సారించాలని దిశా నిర్దేశం చేశారు. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో ప్రచార వ్యూహాలపై పార్టీ ప్రముఖులతో చర్చించారు. ఈ సమావేశంలో ఎంఎన్ఎం ఉపాధ్యక్షులు మౌర్యా, తంగవేలు, ప్రధాన కార్యదర్శి అరుణాచలం, రాష్ట్ర కార్యదర్శులు సెంథిల్, ఆరుముగం, శివ ఇళంగో, స్నేహన్, శ్రీధర్, మురళీ అబ్బాస్, నటి శ్రీప్రియ, స్నేహా మోహన్‌దాస్, మైల్‌సామి, జాన్సన్, మయిల్‌వాహనన్ శ్రీపతి, గోపీనాథ్, అళగర్ ప్రేమ్, రంగనాధన్, అరుళ్‌రాజ్, నాగరాజ్, వైదీశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కలైంజర్ జల్లికట్టు మైదానం ప్రారంభం



అడయార్, జనవరి 23: మదురై జిల్లా అలంగానల్లూరులో రూ.44 కోట్లతో నిర్మించిన డాక్టర్ కలైంజర్ శతజయంతి స్మారక జల్లి కట్టు మైదానాన్ని ముఖ్య మంత్రి ఎంకే స్టాలిన్ బుధవారం ప్రారంభించనున్నారు. ఈ జిల్లాలోని కీళక్కరైలో 66 ఎకరాల్లో ఈ మైదానాన్ని నిర్మించారు. దీన్ని ఈనెల 24న బుధవారం ఉదయం 10 గంటలకు సీఎం స్టాలిన్ ప్రారంభించనున్నారు. ఆ తర్వాత ఈ మైదానంలో తొలిసారి జరిగే జల్లి కట్టు పోటీలను ఆయన వీక్షించనున్నారు. ఈ మైదానంలో వాడివాసల్, దానికి ఇరువైపుల ప్రముఖులు కూర్చొని తిలకించేలా, అదేవిధంగా 20 వేల మంది ప్రేక్షకులు కూర్చొనేలా ఈ స్టేడియంలో గ్యాలరీల నిర్మాణంతో పాటు ఇతర సౌకర్యాలను కల్పించారు. మరోవైపు నేడు జరిగే తొలి జల్లికట్టు పోటీల్లో పాల్గొనేందుకు 3669 మంది యువకులుతోపాటు 9312జల్లి కట్టు ఎద్దుల వివరాలను నమోదు చేయించారు.

సమాచార దర్శిని

రేపు, ఎల్లుండి మద్యం దుకాణాలకు సెలవు

ఐసిఎఫ్, జనవరి 23: మద్యం దుకాణాలకు గురు, శుక్ర వారాలు సెలవు ప్రకటిస్తూ చెన్నై జిల్లా కలెక్టర్ రశ్మీ సిద్ధార్థ్ ఉత్తర్వులు జారీ చేశారు. వడలూరు రామలింగర్ వర్ధంతి రోజైన ఈనెల 25, గణతంత్ర దినోత్సవమైన 26న మద్యం దుకాణాలు, బార్లు మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

ఈబీ కార్యాలయ చిరునామా మార్పు

ఐసిఎఫ్, జనవరి 23: స్థానిక వెస్ట్ మాంబళం విద్యుత్ బోర్డు కార్యాలయ చిరునామా మారింది. వెస్ట్‌మాంబళంలో పని చేస్తున్న ఈ కార్యాలయం ఈనెల 24న బుధవారం నుంచి కోడంబాక్కం రంగరాజపురం కార్పొరేషన్ కాలనీ మెయిన్‌రోడ్డులో వున్న ఉపవిద్యుత్ కేంద్ర ప్రాంగణంలో పని చేయనుందని అధికారులు తెలిపారు.

ఇంజనీరింగ్ కళాశాలలకు ఆండ్రాయిడ్ డిజిటల్ బోర్డులు

ఐసిఎఫ్, జనవరి 23: ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పాఠాలు బోధించేందుకు ఆండ్రాయిడ్ డిజిటల్ బోర్డులు కొనుగోలు చేయనున్నట్లు అన్నా విశ్వవిద్యాలయం తెలిపింది. మొత్తం 45 డిజిటల్ వైట్ బోర్డులు కొనుగోలు చేయనున్నట్లు అధికారులు చెప్పారు. వాటిల్లో అండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్ వినియోగించి ఆధునిక ఏఐ టెక్నాలజీతో పాఠాలు బోధించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో రిమోట్ స్క్రీన్ షేరింగ్, వైఫై, వీడియో రికార్డింగ్, స్క్రీన్ లాక్ వంటి సౌకర్యాలున్నట్లు వర్శిటీ అధికారులు తెలిపారు.

పోలీస్ స్టేషన్లలో బయోమెట్రిక్ పరికరం

ఐసిఎఫ్, జనవరి 23: రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లలో నేరస్తుల కనుపాప, వేలిముద్రలను నమోదు చేసేందుకు బయోమెట్రిక్ పరికరాలను వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా నేరాల నియంత్రణకు కేంద్రప్రభుత్వ ఆర్థిక సహాయంతో 'సీసీటీఎన్ఎస్' అనే నెట్ పని చేస్తోంది. ఇందులో 14 వేల పోలీస్‌స్టేషన్లు, వాటికి సంబంధించి 6 వేల కార్యాలయాలను అనుసంధానం చేశారు. వాటిల్లో రాష్ట్రంలో 1482 పోలీస్ స్టేషన్లు, 479 కార్యాలయాలున్నాయి. త్వరలో కంటిపాప, వేలిముద్రలు నమోదు చేసే డిజిటల్ విధానం అమలులోకి రానుందని అధికారులు పేర్కొన్నారు.

మాధవరంలో డెయిరీ

ఐసిఎఫ్, జనవరి 23: స్థానిక మాధవరంలో డెయిరీని ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఆవిన్ సంస్థ ప్రతిరోజూ 14.5 లక్షల లీటర్ల పాలను చెన్నై నగరంలో విక్రయిస్తోంది. ఉత్తర చెన్నైకి కావాల్సిన పాలప్యాకెట్లు మాధవరం పాల కేంద్రంలో, దక్షిణ చెన్నైకి అవసరమయ్యే పాలప్యాకెట్లు షోళింగనల్లూరు డెయిరీలో, సెంట్రల్ చెన్నైకు కావాల్సిన పాల ప్యాకెట్లు అంబత్తూరులో తయారవుతున్నాయి. చెన్నైలో పాలవిక్రయాలు 25 లక్షల లీటర్లకు పెంచాలని నిర్ణయించిన ఆవిన్ సంస్థ రూ.81 కోట్లతో అత్యాధునిక డెయిరీని మాధవరంలో నిర్మించనుంది.

'తల్లిదండ్రులను సన్మానిద్దాం'

ఐసిఎఫ్, జనవరి 23: 'తల్లిదండ్రులను సన్మానిద్దాం' పేరుతో పాఠశాలల్లో విద్యార్థుల కుటుంబీకులను సన్మానించేందుకు విద్యాశాఖ సన్నాహాలు చేస్తోంది. దీనికి సంబంధించిన ప్రారంభ కార్యక్రమం మదురైలో ఈనెల 29న జరగనుంది. పాఠశాల విద్యాశాఖ మంత్రులు, అధికారులు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఏడు విడతలుగా ఒక్కోజిల్లాలో తల్లిదండ్రులను ఆహ్వానించి, సన్మానించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతులు అభివృద్ధికి విరాళాలు సేకరించవచ్చని అధికారులు భావిస్తున్నారు.

క్రియేటివ్ డిజైన్ పోటీలు

ఐసిఎఫ్, జనవరి 23: మెట్రోరైల్ సేవలపై అవగాహన కల్పించేలా సీఎంఆర్ఎల్ నగరంలోని అన్ని కళాశాలల విద్యార్థులకు 'క్రియేటివ్ డిజైన్' పోటీలు నిర్వహించనుంది. 'మెట్రోరైల్ ఉపయోగించండి.. మీ ప్రయాణ సమయాన్ని ఆదా చేయండి' శీర్షికతో నిర్వహించనున్న ఈ పోటీల కోసం ఔత్సాహికులు ఫిబ్రవరి 22వ తేదీ లోగా https://forms.gle/ వెబ్‌సైట్‌లో తమపేర్లను నమోదు చేసుకోవచ్చు. మార్చి31న ఆవిష్కరణలను సమర్పించాల్సి ఉంటుంది. ఏప్రిల్ 14వ తేదీన విజేతలను ప్రకటిస్తారు. వివరాలకు line@cmrl.inలో సంప్రదించవచ్చు.

క్యాన్సర్ పరీక్షలు తప్పనిసరి

ఐసిఎఫ్, జనవరి 23: రాష్ట్రంలో 18 ఏళ్లకు పైబడిన వారు క్యాన్సర్ వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ఆరోగ్యశాఖ డైరెక్టర్ సెల్వవినాయగం సూచించారు. బాధితుల్లో అత్యధికులు మూడు రకాల క్యాన్సర్‌కు గురవుతున్నారని, ముఖ్యంగా మహిళలు, పురుషుల్లో నోటి క్యాన్సర్ కన్పిస్తోందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ప్రధాన ఆసుపత్రులు, వైద్య కళాశాల ఆసుపత్రుల్లో 18 ఏళ్ల పైబడ్డ అందరూ ఉచితంగా క్యాన్సర్ వైద్య పరీక్షలు చేయించుకోవచ్చని చెప్పారు. త్వరలో నాలుగు జిల్లాల్లో 19 లక్షల మంది మహిళలు సహా 52 లక్షలమందికి పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు.

ఆమ్నీ బస్సులకు రూ.36.55 లక్షల జరిమానా

ఐసిఎఫ్, జనవరి 23: సంక్రాంతి పండుగ సందర్భంగా ఆమ్నీ బస్సుల్లో అదనపు చార్జీలు వసూలు చేసిన 1892 బస్సుల నుంచి రూ.36.55 లక్షలు జరిమానా వసూలు చేసినట్లు రవాణాశాఖ అధికారులు తెలిపారు. ఆమ్నీ బస్సుల్లో అదనపు చార్జీలు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 10 నుంచి 21వ తేదీ వరకు అధికారులు తనిఖీలు జరిపారు. ఇందులో అదనపు చార్జీలు వసూలు చేసినట్లు తేలింది. దీంతో ఈ వ్యవహారంపై దర్యాప్తు చేసిన అధికారులు.. రూ.36,55,414 జరిమానా వసూలు చేశారు.

ఐపీఎస్ అధికారి సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దు

ప్యారీస్, జనవరి 23: తిరునల్వేలి జిల్లా అంబాసముద్రం పోలీసుస్టేషన్‌లో విచారణ పేరుతో ముద్దాయిల పళ్లు ఊడగొట్టిన ఐపీఎస్ అధికారి బల్వీర్‌సింగ్‌పై సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దు చేస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విక్రమసింగపురం, కల్లిడకుర్చి, అంబాసముద్రం ప్రాంతాల్లో నేరాలకు పాల్పడిన 15 మందిని 2020లో పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద విచారణ జరిపిన ఐపీఎస్ బల్వీర్‌సింగ్ ముద్దాయిల పళ్లు ఊడగొట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై సీబీసీఐడీ పోలీసులు కేసు నమోదుచేసి బల్వీర్‌సింగ్ సహా 15 మందిపై నాలుగు కేసులు నమోదు చేసి వారిని అరెస్ట్ చేశారు. గత డిసెంబరు 15వ తేది సస్పెండ్‌కు గురైన బల్వీర్‌సింగ్‌కు సహా 15 మందిని బెయిలుపై విడుదల చేస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో, బల్వీర్‌సింగ్ సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దు చేస్తూ రాష్ట్రప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

అసోం ప్రభుత్వ తీరును ఖండిస్తూ కాంగ్రెస్ ధర్నా

ప్యారీస్, జనవరి 23: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన 'భారత్ న్యాయ్' యాత్రను అడ్డుకున్న అసోం ప్రభుత్వ తీరును ఖండిస్తూ తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం పల్లికరనైలో ధర్నా నిర్వహించారు. ఆ ప్రాంతంలోని అసోం ప్రభుత్వ భవనాన్ని ముట్టడించేందుకు ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎంపీ నిరంజన్‌కుమార్ సారథ్యంలో మహిళలు, వివిధ విభాగాల కార్యకర్తలు యత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ప్లకార్డులు చేతబట్టి ప్రధాని నరేంద్ర మోదీ, అసోం సీఎం హిమంత బిస్వశర్మలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దేశం కోసం న్యాయ యాత్ర చేపట్టిన రాహుల్‌ని అడ్డుకోవడం అప్రజాస్వామ్యకమని ఆందోళనకారులు విమర్శించారు.



స్థానిక పల్లికరనైలోని అస్సోం ప్రభుత్వ భవనం ముందు నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ శ్రేణులు

నారాయణి నర్సింగ్ స్కూలులో నర్సుల దినోత్సవం



వేలూరు, జనవరి 23: వేలూరు జిల్లా అరియూరు శ్రీ నారాయణి నర్సింగ్ కళాశాలలో మంగళవారం నర్సుల దినోత్సవం ఘనంగా జరిగింది. నారాయణి ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ బాలాజీ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకలకు జాయింట్ డైరెక్టర్ లలిత పురుషోత్తమన్, ప్రిన్సిపాల్ ప్రభ, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాపాత్తి, వైస్ ప్రిన్సిపాల్ గాంధీమతి, మెడికల్ సూపరింటెండెంట్ గీతా, శక్తి అమ్మ హెల్త్‌కేర్ ట్రస్టీ కలై అరసన్ తదితరులు కూడా హాజరయ్యారు. ఇందులో నర్సింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్న 40 మంది విద్యార్థినులు, డిగ్రీ చదువుతున్న 40 మంది విద్యార్థినులు ఈ కార్యక్రమంలో పాల్గొని కొవ్వొత్తులు చేబూని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పాపాత్తి మాట్లాడుతూ.. నర్సింగ్ విభాగంలో ఉండేవారు రోగుల పట్ల జాలి, దయతో వ్యవహరించాలని, స్నేహంగా మసలుకోవాలని హితవు పలికారు.

మూఢ నమ్మకానికి చిన్నారి బలి

ఐసిఎఫ్, జనవరి 23: చికెన్ పాక్స్‌కు గురైన చిన్నారిని ఆసుపత్రికి తరలించకుండా మూఢనమ్మకాలతో ఆలయంలో ఉంచడంతో బాలుడు కన్నుమూసిన ఘటన స్థానిక ఆవడిలో వెలుగు చూసింది. ఆవడి సమీపంలోని మోరై గ్రామం జేజేనగర్‌లో 300కు పైగా ఆదివాసీలు నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో సెల్వం కుమారుడు అశోకన్ రెండు వారాలుగా చికెన్‌పాక్స్‌తో బాధపడుతున్నాడు. తల్లిదండ్రులు అతన్ని ఆసుపత్రికి తరలించకుండా అదే ప్రాంతంలో ఉన్న అంకాళమ్మ ఆలయంలో వుంచి పసర్లు పోశారు. అతని పరిస్థితి విషమించడంతో ఈనెల 20న ఆ చిన్నారి మృతి చెందాడు. ఈ సమాచారం అందుకున్న అధికారులు.. అక్కడికి చేరుకోవడంతో అశోకన్ కుటుంబీకులు వారిని దరి చేరనీయకుండా అడ్డుకున్నారు. ఆవడి ట్యాంక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొరట్టూరు చెరువులో వ్యక్తి మృతదేహం

ప్యారీస్, జనవరి 23: స్థానిక అంబత్తూర్ సమీపంలోని కొరట్టూరు చెరువులో తీరానికి కొట్టుకొచ్చిన వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని విచారణ చేపట్టారు. సోమవారం మధ్యాహ్నం చెరువు గట్టున వాకింగ్ శిక్షణలో పాల్గొన్న కొందరు ఓ వ్యక్తి మృతదేహం నీటిపై తేలియాడుతోందంటూ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలికి అగ్నిమాపక శాఖ సిబ్బందితో చేరుకున్న పోలీసులు 40 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని వెలికితీసి కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

లారీ నడుపుతూ గుండెపోటుతో డ్రైవర్ మృతి

ప్యారీస్, జనవరి 23: స్థానిక పుళల్ సమీపంలో గుండెపోటుతో ఓ లారీ డ్రైవర్ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. తిరుప్పూర్ వేలంపాళయానికి చెందిన ముత్తుకుమార్ (51)అనే లారీడ్రైవర్ తిరుప్పూర్ నుంచి సరుకులను రెడ్‌హిల్స్ సమీపంలోని గాంధీనగర్‌లో ఉన్న గోదాములో దించాడు. అనంతరం మాధవరంలోని లారీ షెడ్‌కు తీసుకెళ్తున్న సమయంలో, పుళల్ కావాంగరై జంక్షన్‌కు చేరుకున్న సమయంలో ముత్తుకుమార్ హఠాత్తుగా గుండెపోటుకు గురయ్యాడు. లారీసెంటర్ మీడియన్‌ను ఢీకొని రోడ్డు పక్కన ఆగింది. దీంతో,స్థానికులు108అంబులెన్స్‌కు ఫోన్‌చేయగా అక్కడకు చేరుకున్న నర్సులు ముత్తుకుమార్‌ను పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

10మందికి లై డిటెక్ట్ పరీక్ష

వేంగైవాయల్ వ్యవహారం

ప్యారీస్, జనవరి 23: పుదుకోట జిల్లా వేంగైవాయల్‌లో తాగునీటి తొట్టెలో మానవ వ్యర్థాలు కలిసిన వ్యవహారంలో అనుమానిస్తున్న 10మందికి లై డిటెక్ట్ పరీక్ష నిర్వహించేందుకు సీబీసీఐడీ పోలీసులు నిర్ణయించారు. గత 2022 డిసెంబరు 26వ తేది దళిత కాలనీకి తాగునీరు అందించే ట్యాంక్‌లో మానవ వ్యర్థాలు కలపడాన్ని నిరసిస్తూ వివిధ రాజకీయ పార్టీలు, దళిత సంఘాలు ఆందోళన నిర్వహించాయి. దీంతో రాష్ట్ర పోలీసుల విచారణ నుంచి ఈ కేసును సీబీసీఐడీకి బదిలీ అయింది. ఎస్పీ పాల్‌పాండి నేతృత్వంలో ఏర్పాటైన 10 ప్రత్యేక బృందాలు వివిధ కోణాల్లో ఇప్పటివరకు 221 మంది వద్ద విచారణ జరిపి వాంగ్మూలం రికార్డు చేసుకున్నారు. మరోవైపు ఈ వ్యవహారంలో మద్రాసు హైకోర్టు... రిటైర్డ్ జడ్జి సత్యనారాయణన్ నేతృత్వంలో కమిటీని గత ఏడాది మే 6వ తేది నియమించింది. ఫోరెన్సిక్ విభాగం నిపుణులు ఈ కమిటీ ఉత్తర్వుల మేరకు 31 మంది వద్ద సేకరించిన రక్తనమూనాలను ప్రయోగశాలకు పంపించింది. తదుపరి చర్యల కింద అనుమానం ఉన్న 10 మందికి లై డిటెక్ట్ పరీక్ష నిర్వహించేందుకు అనుమతి కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు సీబీసీఐడీ పోలీసులు తెలిపారు.

మహిళలను బెదిరించిన విద్యావేత్త అరెస్ట్

ప్యారీస్, జనవరి 23: నామక్కల్ జిల్లా తిరుచెంగోడులో అర్ధనారీశ్వరర్ ఐఏఎస్ అకాడమీ నడుపుతూ 30 మందికి పైగా మహిళలను బెదిరించిన ఆ సంస్థకు చెందిన అశ్విన్ (30)ను పోలీసులు అరెస్ట్ చేశారు. అకాడమీలో చేరిన మహిళల వద్ద సినిమాల్లో నటించేందుకు అవకాశం కల్పిస్తామని, కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి వారి పట్ల అశ్విన్ అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు బెదిరించినట్లు బాధిత విద్యార్థినులు తిరుచెంగోడు మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన పోలీసులు అశ్విన్‌ను అరెస్ట్ చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు 15 రోజుల రిమాండ్‌కు తరలించారు.

మహిళా ఐపీఎస్‌కు లైంగిక వేధింపుల స్పెషల్ డీజీపీకి సుప్రీం షాక్

అడయార్, జనవరి 23: రాష్ట్రానికి చెందిన మహిళా ఐపీఎస్ అధికారిణిని లైంగికంగా వేధించిన కేసులో స్పెషల్ డీజీపీ రాజేష్ దాస్‌కు సుప్రీంకోర్టు తేరుకోలేని షాకిచ్చింది. ఈ కేసులో ఆయనకు విధించిన శిక్షను రద్దు చేయాలని కోరుతూ దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఈ వేధింపుల కేసులో రాజేష్‌దాస్‌కు మూడేళ్ల జైలు శిక్షను విధిస్తూ విల్లుపురం జిల్లా క్రిమినల్ మేజిస్ట్రేట్ కోర్టు తీర్పునిచ్చింది. అయితే, ఈ తీర్పును ఆయన పై కోర్టుల్లో అప్పీల్ చేస్తున్నారు. అయితే, ఈ కేసు విచారణను మరో జిల్లా లేదా రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరుతూ ఆయన సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తులు పీకే మిశ్రా, హెచ్.రాయ్ సారథ్యంలోని ధర్మాసనం విచారణ జరిపి.. కేసు విచారణ సజావుగానే సాగుతోందని, అందువల్ల మరో జిల్లా లేదా రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని పేర్కొంటూ పిటిషన్‌ను తోసిపుచ్చారు.

కళాశాలకు తల్లిదండ్రులను పిలిపించారనీ.. ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

పెరంబూర్, జనవరి 23: కళాశాలకు తల్లిదండ్రులు రావడంతో మనస్తాపం చెందిన ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తిరుచ్చి జిల్లాలో చోటుచేసుకుంది. కడలూరు జిల్లా విరుదాచలం సమీపం ఊరమంగళం గ్రామానికి చెందిన రాజా మాణిక్యం కుమార్తె తమిళరసి(20) తిరుచ్చి జిల్లా అమ్మపేటలోని శివాని ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతోంది.ఆమె కొంతకాలంగా అదే కళాశాలలో ఓ విద్యార్థితో చనువుగా ఉండడాన్ని గమనించిన అధ్యాపకులు పలుమార్లు ఆమెను హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై మాట్లాడేందుకు కళాశాల నిర్వాహకులు విద్యార్థిని తల్లిదండ్రులను సోమవారం పిలిపించారు. తల్లిదండ్రులు కళాశాలకు రావడాన్ని గమనించిన తమిళరసి మనస్తాపంతో కళాశాల ప్రాంగణంలో ఉన్న హాస్టల్‌లోని తన గదికి వెళ్లి ఉరివేసుకుంది.

రెండ్రోజులు మూతపడనున్న మీంజూరు నిర్లవణీకరణ ప్లాంట్

అడయార్, జనవరి 23: నగర శివారు ప్రాంతమైన మీంజూరులో ఉన్న నిర్లవణీకరణ ప్లాంట్‌ను మరమ్మతుల కోసం రెండు రోజుల పాటు మూసివేయనున్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి రెండు రోజుల పాటు తాత్కాలికంగా ప్లాంట్‌ను మూసివేస్తున్నట్టు చెన్నై మెట్రో వాటర్ బోర్డు పేర్కొంది. ఈ ప్లాంట్ నుంచి ప్రతి రోజూ 100 మిలియన్ లీటర్ల సముద్రపు నీటిని తాగునీరుగా మార్చి నగరవాసులకు సరఫరా చేస్తున్నారు. ఈ నెల 26వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 28వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఈ ప్లాంట్‌లో వివిధ రకాల మరమ్మతులు చేపట్టనుండటంతో ఆ రెండు రోజుల పాటు ఈ ప్లాంట్ నుంచి తాగునీటి ఉత్పత్తి నిలిచిపోతుందని అధికారులు వెల్లడించారు.

మంత్రి మదివేందన్‌కు అస్వస్థత



పెరంబూర్, జనవరి 23 : రాష్ట్ర అటవీశాఖ మంత్రి మదివేందన్ అస్వస్థతకు గురయ్యారు. రెండు రోజుల క్రితం రామనాథపురం పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి ఆహ్వానం పలికిన మంత్రి మదివేందన్.. ప్రధానితో కలసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో, సోమవారం సాయంత్రం హఠాత్తుగా మంత్రి అస్వస్థతకు గురికావడంతో కోయంబత్తూర్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, మరో రెండు రోజుల్లో డిశ్చార్జి చేస్తామని వైద్యులు తెలిపారు.

ఆరోగ్యశాఖపై సమీక్ష



జ్యోతి ప్రజ్వలనతో సమావేశాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమరవేల్ పాండ్యన్

వేలూరు, జనవరి 23: స్థానిక కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జిల్లా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న వైద్యచికిత్సలు, ప్రాథమిక వసతుల కల్పన తదితరాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమరవేల్ పాండ్యన్ అధ్యక్షత వహించగా, జిల్లా వైద్యపనుల జాయింట్ డైరెక్టర్ బాలచందర్, జాయింట్ డైరెక్టర్లు భానుమతి, మణిమేఘలై సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

అన్నామలై పాదయాత్ర విజయవంతం చేయాలి



నిరుద్యోగులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న ఏసీ షణ్ముగం

వేలూరు, జనవరి 23: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై వచ్చే వారం జిల్లాలో చేపట్టనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని పుదియ నీతి పార్టీ అధ్యక్షుడు ఏసీ షణ్ముగం పిలుపునిచ్చారు. సత్తువాచేరిలోని కృష్ణామహాల్‌లో మంగళవారం జరిగిన ఆ పార్టీ నియోజకవర్గస్థాయి సమావేశానికి పార్టీ అధ్యక్షుడు ఇంద్రనాథ్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా హాజరైన షణ్ముగం మాట్లాడుతూ... తమ పార్టీ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాల్లో 95 వేల మంది లబ్ధి పొందారన్నారు. వేలూరు, గుడియాత్తం ప్రాంతాల్లో జాబ్ మేళాలు నిర్వహించి 6 వేలమంది యువకులకు ఉద్యోగాలు కల్పించామని ఆయన తెలిపారు. కార్యక్రమంగా భాగంగా కార్యకర్తలు వెండి సెంగోలును షణ్ముగంకు ప్రదానం చేశారు.

1న పీఎంకే ప్రత్యేక సర్వసభ్య మండలి సమావేశం

పెరంబూర్, జనవరి 23: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కూటమి ఏర్పాటుపై చర్చించేందుకు ఫిబ్రవరి 1న ప్రత్యేక సర్వసభ్య మండలి సమావేశం నిర్వహిస్తున్నట్లు పీఎంకే రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ అన్బుమణి రాందాస్ తెలిపారు. 2019 పార్లమెంటు, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమిలో పోటీ చేసిన పీఎంకే.. 2022లో ఆ కూటమి నుంచి వైదొలిగింది. అనంతరం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీ ఒంటరిగా పోటీ చేసింది. ఈ నేపథ్యంలో, త్వరలో జరుగుతున్న పార్లమెంటు ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తామని ఆ పార్టీ ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి కూటమి ఏర్పాటు పై చర్చించేందుకు ఆ పార్టీ ప్రత్యేక సర్వసభ్య మండలి సమావేశం ఫిబ్రవరి 1న ఎగ్మోర్‌లోని రాణి మెయ్యమ్మ ఆడిటోరియంలో పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ నేతృత్వంలో జరగనుంది. ఈ సమావేశంలో పార్టీ గౌరవాధ్యక్షుడు జీకే మణి, ప్రధాన కార్యదర్శి వడివేలు రాఘవన్, కోశాధికారి తిలక్ బామా పాల్గొననున్నారు. ఈ సమావేశంలో తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల నిర్వాహకులు, జిల్లా కార్యదర్శులు, పంచాయతీల ప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొంటారు.

కారుతో ఉడాయించిన ఇద్దరి అరెస్టు

అడయార్, జనవరి 23: స్థానిక కోయంబేడులో కారుతో ఉడాయించిన ఇద్దరిని నగర పోలీసులు అరెస్టు చేశారు. కోయంబేడుకు చెందిన విజయన్ తన కారును లక్షన్నర రూపాయలకు విక్రయించనున్నట్టు ప్రకటన చేశాడు. దీన్ని చూసిన ఇద్దరు విజయ్‌ను ఫోనులో సంప్రదించి, కారును టెస్ట్ డ్రైవ్ చేయాలంటూ నమ్మించారు. దీంతో కారును వారికి అప్పగించడంతో ఆ ఇద్దరూ కారుతో పారిపోయారు. ఎంతకీ వారిద్దరూ రాకపోవడంతో ఆయన కోయంబేడు పోలీసులు ఆశ్రయించాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు.. కారును స్వాధీనం చేసుకుని, విల్లివాక్కంకు చెందిన ప్రవీణ్ కుమార్ (19), కొళత్తూరుకు చెందిన జాన్ (45)ని అరెస్టు చేశారు.

డీఎంకే ఎమ్మెల్యే కుమారుడి కోసం పోలీసుల గాలింపు

ప్యారీస్, జనవరి 23: చిన్నారిని చిత్రహింసలు చేసి పరారైన వ్యవహారంలో డీఎంకే ఎమ్మెల్యే కరుణానిధి కుమారుడి కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. పల్లావరం డీఎంకే ఎమ్మెల్యే కరుణానిధి కుమారుడు ఆంద్రో మదివానన్ తిరువాన్మియూర్‌లో నివసిస్తున్నారు. గత ఏడాది ఏప్రిల్‌లో ఆయన ఇంట్లో కళ్లకుర్చి జిల్లా ఉళుందూర్‌పేట ప్రాంతానికి చెందిన ఓ దళిత చిన్నారి పనుల్లో చేరింది. ప్లస్‌టూ పరీక్షల్లో అత్యధిక మార్కులు పొందిన ఆ చిన్నారి ఉన్నత చదువులు చదివేందుకు సహకరిస్తామని ఆమె తల్లిదండ్రులకు ఆంద్రో మదివానన్ సతీమణి మెర్లిన్ ఇంటి పనులకు చేర్చుకుంది. అయితే ఆ చిన్నారిని హింసించి ఉదయం నుంచి రాత్రి వరకు పనులు చేయించుకున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై చిన్నారి తల్లిదండ్రులు అందజేసిన ఫిర్యాదును నీలాంగరై పోలీసులు ఆరు సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. ఈ విషయం తెలిసి ఎమ్మెల్యే కుమారుడు, కోడలు వారం క్రితం అదృశ్యమయ్యారు. కేసు విచారణ తీవ్రతరం చేసిన పోలీసులు, వారిద్దరి కోసం మూడు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి గాలిస్తున్నారు.



చెన్నై టి.నగర్ టీటీడీ ఆలయంలో శ్రీరామజన్మభూమి క్షేత్ర ప్రాణ ప్రతిష్ఠాపన వేడుకల్లో భాగంగా మంగళవారం సాయంత్రం గాత్రకచేరీ చేసిన గీతా కేశవన్‌ను సత్కరిస్తున్న స్థానిక సలహామండలి అధ్యక్షుడు ఏజే శేఖర్, సభ్యులు పీవీ ఆర్ కృష్ణారావు, అనిల్‌కుమార్‌రెడ్డి, మోహన్‌రావు తదితరులు

శ్రీలంక నావికాదళం దాడి

ఆరుగురు రామేశ్వరం జాలర్ల అరెస్టు

చెన్నై, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ రాక సందర్భంగా మూడు రోజులపాటు చేపలవేట మానుకున్న రామేశ్వరం జాలర్లకు నడి సముద్రంలో మంగళవారం వేకువజాము చేదు అనుభవం ఎదురైంది. శ్రీలంక నావికాదళం ఎప్పటిలాగే తమ దేశ సముద్రజలాల్లోకి ప్రవేశించారంటూ దాడి జరిపి ఆరుగురు జాలర్లను నిర్బంధించింది. ఈ సంఘటన గురించి తెలుసుకుని రామేశ్వరం జాలర్ల సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాని రామేశ్వరంలో పర్యటించడంతో ఈనెల 19 నుంచి 21 వరకు జాలర్లు చేపలవేటకు వెళ్లకూడదంటూ అధికారులు నిషేధం విధించారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల తర్వాత రామేశ్వరం నుంచి సోమవారం 480 మరపడవల్లో 3 వేల మందికిపైగా జాలర్లు చేపలవేటకు వెళ్లారు. మంగళవారం వేకువజాము కచ్చాదీవికి, నెడుదీవికి నడుమ వలలు విసిరి చేపలు పడుతుండగా గస్తీ నౌకలో వచ్చిన శ్రీలంక నావికాదళం సభ్యులను చూసిన జాలర్లు వలలను ముడిచి వెనుదిరిగారు. అదే సమయంలో శ్రీలంక నావికాదళం సభ్యులు జాలర్లపై దాడి జరిపారు. ఆ తర్వాత తంగచ్చిమఠానికి చెందిన జాక్సన్ (47), ఈస్టర్ ఆరోగ్యదాస్ (43)కు చెందిన రెండు మరపడవలను స్వాధీనం చేసుకున్నారు. పడవలో ఉన్న ఐజాక్, సిసేరియన్, సమాధానబాబు, ఈ.ఆరోగ్యదాస్, నిశాంతన్, మురుగేశన్ అనే జాలర్లను నిర్బంధించి శ్రీలంక గాంగేశన్ రేవుకు తీసుకెళ్లారు. ఈ సంఘటనపై రామేశ్వరం జాలర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే జోక్యం చేసుకుని శ్రీలంక నావికాదళం అరెస్టు చేసిన ఆరుగురు జాలర్లను, స్వాధీనం చేసుకున్న రెండు మరపడవలను విడిపించాలని డిమాండ్ చేశారు.

మీనంబాక్కం మెట్రోరైల్వేస్టేషన్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం



గాయపడిన తరుణ్

చెన్నై, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మీనాంబాక్కం మెట్రో రైల్వేస్టేషన్‌లో ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదృష్టవశాత్తూ అతడిపై రైలు దూసుకుపోలేదు. తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వడపళని మసూది వీధికి చెందిన తరుణ్ మీనంబాక్కంలోని ఓ కళాశాలలో బీసీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. రోజూ మెట్రోరైలులో కళాశాలకు వెళ్తున్నాడు. సోమవారం సాయంత్రం కళాశాల ముగియగానే ఇంటికి వెళ్లేందుకు మీనంబాక్కం మెట్రోరైల్వేస్టేషన్‌కు వెళ్లాడు. ఆ సమయంలో అటుగా మెట్రో రైలు వస్తుండటం గమనించిన తరుణ్ పట్టాలపై దూకాడు. అయితే తరుణ్‌పై రైలు దూసుకుపోకుండా ఇంజన్ ముందుభాగంలో చిక్కుకున్నాడు. ఆ రైలు కొంత దూరం వెళ్లి ఆగింది. అప్పటికే తీవ్రంగా గాయపడిన తరుణ్‌ను పోలీసులు అంబులెన్స్‌లో స్టాన్లీ ఆసుపత్రికి తరలించారు. తరుణ్ తల్లిదండ్రులు సినీ రంగంలో పని చేస్తున్నారని, కొంతకాలంగా అతడు మానసికంగా బాధపడుతూ గడిపాడని విచారణలో తెలిసింది. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించాడన్నారు. మీనంబాక్కం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గవర్నర్ కార్యక్రమంలో పాల్గొంటేనే అటెండెన్స్

ప్యారీస్, జనవరి 23: రాష్ట్ర గవర్నర్ పాల్గొనే కార్యక్రమాల్లో పాల్గొనే విద్యార్థులకు మాత్రమే అటెండెన్స్ వేస్తామని గిండిలోని అన్నా విశ్వవిద్యాలయం జారీచేసిన సర్క్యులర్ చర్చనీయాంశమైంది. వర్శిటీలోని ఆడిటోరియంలో నేతాజీ సుభాస్ చంద్రబోస్ 127వ జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించగా, గవర్నర్ రవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకల్లో ప్రేక్షకులుగా వర్శిటీ విద్యార్థులందరూ పాల్గొనాల్సిందిగా మౌఖిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో, వేదిక ప్రాంగణంలో అటెండెన్స్ రిజిస్టర్‌ని ఉంచారు. దీనిపై అధికారులు మీడియాతో మాట్లాడుతూ... గవర్నర్ పాల్గొనే కార్యక్రమాలకు హాజరయ్యే విద్యార్థులు మాత్రమే అటెండెన్స్ వేయాల్సిందిగా వర్శిటీ సర్క్యులర్ జారీ చేసిందని వివరించారు.

రైలు చక్రాల్లో పొగ

- ఆలస్యంగా బయలుదేరిన పాటలీపుత్ర ఎక్స్‌ప్రెస్



మంటల్ని అదుపు చేస్తున్న సిబ్బంది

వేలూరు, జనవరి 23: బెంగళూరు నుంచి పాటలీపుత్ర వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలులో పొగలు రావడంతో, సిబ్బంది దానికి మరమ్మతు చేసి పంపడంలో జాప్యం జరిగింది. రాణీపేట జిల్లా ముకుందరాయపురం వద్ద రైలు చక్రాల నుంచి పొగ వచ్చింది. దీనిని గమనించిన ప్రయాణికులు కేకలు వేయడంతో సిబ్బంది పొగను ఆర్పారు. చక్రాల్లో సాంకేతిక సమస్య కారణంగా చిన్నపాటి మంటలు చెలరేగి, పొగవచ్చినట్లు సిబ్బంది గుర్తించారు. అనంతరం రైలు అరగంట ఆలస్యంగా బయలుదేరింది.

ఒకేరోజు రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.168 కోట్ల ఆదాయం

పెరంబూర్, జనవరి 23: రాష్ట్రంలో ఈనెల 22వ తేది 21,004 రిజిస్ట్రేషన్లు జరిగి ప్రభుత్వానికి రూ.168.83 కోట్ల ఆదాయం సమకూరింది. తై పొంగల్ ముగిసిన తర్వాత రోజు నుంచి స్థలాలు, భూములు, గృహాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు అధికంగా జరుగుతుంటాయి. ప్రజల సౌకర్యార్థం ఈనెల 31వ తేది వరకు కార్యాలయాల్లో అదనపు టోకెన్లు అందజేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో, సోమవారం ఒకే రోజున రాష్ట్రవ్యాప్తంగా 21,004 రిజిస్ట్రేషన్లు జరిగి, ప్రభుత్వానికి రూ.168.83 కోట్ల ఆదాయం లభించింది. రాజధాని నగరం చెన్నైలో సోమవారం రోజున 137 అపార్ట్‌మెంట్లకు సంబంధించి రిజిస్ట్రేషన్లు జరిగి, రూ.12 కోట్ల ఆదాయం లభించిందని రిజిస్ట్రేషన్ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

రేషన్ ఉద్యోగులకు ప్రోత్సాహక భత్యం

పెరంబూర్, జనవరి 23: రేషన్ ఉద్యోగులకు ప్రోత్సాహక భత్యం అందజేయనున్నట్లు సహకార శాఖ ప్రకటన పేర్కొంది. సంక్రాంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 1.13 కోట్ల బియ్యంకార్డులకు రూ.1,000 నగదుతో పాటు బియ్యం, చక్కెర, చెరకుగడ అందజేశారు. ఈ నగదు పంపిణీకి సంబంధించి రేషన్ ఉద్యోగులు వినియోగదారుల ఇళ్లకే వెళ్లి టోకెన్లు అందించడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరకులు పంపిణీ చేశారు. దీంతో, రేషన్ ఉద్యోగులకు కార్డుకు 50 పైసల చొప్పున ప్రోత్సాహక భత్యం అందించనున్నట్లు, దీనిని ఉద్యోగుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఎంటీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

పెరంబూర్, జనవరి 23: స్థానిక కొరట్టూరులో ఎంటీసీ బస్సు ఢీకొని మహిళ మృతి చెందింది. కొళత్తూర్ పూంపుహార్ నగర్‌కు చెందిన విద్య ఓ ప్రైవేటుసంస్థలో పనిచేస్తోంది. మంగళవారం ఉదయం బస్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్న తరుణంలో, కోయంబేడు నుంచి రెడ్‌హిల్స్‌కు వెళుతున్న 114 బస్సు ఢీకొనడంతో చక్రం కింద చిక్కుకొని సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. ఈ ఘటనలో తప్పించుకొనేందుకు యత్నించిన బస్సు డ్రైవర్ రమేష్ పట్టుకుని ప్రజలు చితకబాదడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై రెడ్‌హిల్స్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఈపీఎస్ కేసులో మంత్రి ఉదయనిధి కౌంటర్ దాఖలు

అడయార్, జనవరి 23: కొడనాడు ఎస్టేట్‌లో సెక్యూరిటీ గార్డు హత్య, దోపిడీ కేసులో మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామికి సంబంధం ఉన్నట్లు వ్యాఖ్యానించకుండా విధించిన స్టేను తొలగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌కు రాష్ట్ర మంత్రి ఉదయనిధి కౌంటర్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ మంగళవారం న్యాయమూర్తి సతీష్‌కుమార్ సమక్షంలో విచారణకురాగా, మంత్రి ఉదయనిధి తరఫున కౌంటర్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ తర్వాత ఈపీఎస్ తరపు న్యాయవాదులు కౌంటర్ దాఖలు చేసేందుకు కొంత సమయం కావాలని కోరడంతో ఈ కేసు తదుపరి విచారణను వచ్చే నెల 26వ తేదీకి వాయిదా వేశారు.

సినిమాల్లో రాజకీయాల ప్రస్తావన
తప్పుకాదు
● కీర్తి పాండ్యన్



అశోక్ సెల్వన్ - కీర్తి పాండ్యన్

సినిమాల్లో రాజకీయాలను ప్రస్తావించడంలో ఎలాంటి తప్పు లేదని హీరోయిన్ కీర్తి పాండ్యన్ అన్నారు. నీలం ప్రొడక్షన్స్ బ్యానర్‌పై పా.రంజిత్, లెమన్ లీఫ్ క్రియేషన్స్ పతాకం తరపున ఆర్.గణేశమూర్తి, జి.సౌందర్య సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'బ్లూస్టార్'. అశోక్ సెల్వన్, సంతాను భాగ్యరాజ్, కీర్తిపాండ్యన్, పృథ్వీ, భగవతి పెరుమాళ్, ఇళంగో కుమారవేల్, లిజి ఆంటోని, దివ్య దురైస్వామి తదితరులు నటించారు. జయకుమార్ దర్శకుడు. ఈనెల 25న విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ చెన్నైలో జరిగింది. ఇందులో చిత్ర బృందంతోపాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. హీరోయిన్ కీర్తి పాండ్యన్ మాట్లాడుతూ... 'ఈ సినిమాలో నా పాత్ర మాత్రమే కాదు మిగిలినవీ నాకు బాగా నచ్చాయి. ఇందులో పా.రంజిత్ ఉన్నారు. దీంతో ఇందులో రాజకీయాలపై విమర్శలు ఎక్కుపెడుతున్నారా? అని ప్రశ్నిస్తున్నారు. సినిమాల్లో రాజకీయాల ప్రస్తావన ఉంటే తప్పేంటి. రాజకీయాలు లేకుండా మనకు జీవితం లేదు' అని అన్నారు. హీరో అశోక్ సెల్వన్ మాట్లాడుతూ... 'ఈ సినిమా నాకు ప్రత్యేకం. దీనికి కారణం.. ఇది సినిమానా? లేక అరక్కోణం ప్రజలా అనేది తెలియదు. వారి జీవితం నా జీవితాన్ని పోలి ఉంటుంది. నా జీవితం వెండితెరపై ప్రతిఫలించనుంది. కొందరి మాటలకు, చేతలకు పొంతన ఉండదు. కానీ, పా.రంజిత్ ఏం మాట్లాడుతారో ఆయన పనులు అలానే ఉంటాయి' అన్నారు. దర్శకుడు జయకుమార్ మాట్లాడుతూ... 'ఈ సినిమా స్టోరీ నా వ్యక్తిగత ప్రేమకథ అంటున్నారు. అది నిజం కాదు. ఒక విషయం నిన్ను ఏడిపిస్తుందంటే ఆ విషయానికి నీవు నిజాయితీగా ఉండు అని ఎవరూ చెప్పరు. కానీ, ఈ చిత్రం ద్వారా ఒక మంచి సందేశం ఇస్తున్నా' అని అన్నారు. అలాగే, సంగీత దర్శకుడు వసంత్ గోవింద్ తదితరులు ప్రసంగించారు.

చిత్రజ్యోతి

ప్రధాని మోదీకి దక్కిన భాగ్యం
● ఇళయరాజా


రామ్ లల్లా - ఇళయరాజా

అయోధ్య రామమందిరంలో బాల రాముడి ప్రాణప్రతిష్ఠ చేయడం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లభించిన భాగ్యమని ప్రముఖ సంగీత దర్శకుడు, ఇసైజ్ఞాని ఇళయరాజా అన్నారు. అయోధ్య రామమందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నగరంలో 'చెన్నైలో అయోధ్య' అనే పేరుతో స్థానిక నారద గాన సభలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి, ఇళయరాజా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇళయరాజా మాట్లాడుతూ... 'ప్రపంచవ్యాప్తంగా ఒక కార్యక్రమం జరగడం చరిత్రలో ఇదే తొలిసారి. చరిత్రలో చెరిగిపోని విధంగా ఈ మహాఘట్టాన్ని ప్రధాని మోదీ విజయవంతంగా పూర్తి చేశారు. ఇది ఆయనకు కలిగిన భాగ్యం. అయోధ్యలో ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనాల్సిన నేను ఇక్కడ ఉండటం ఒకింత బాధగా ఉంది' అని అన్నారు.

పుణె ఫెస్టివల్‌లో 'ఇడిముళక్కం'


జీవీ ప్రకాష్ - శీను రామస్వామి తదితరులు

ప్రముఖ దర్శకుడు శీను రామస్వామి దర్శకత్వం వహించిన 'ఇడిముళక్కం' చిత్రం పుణె ఇంటర్నేషనల్ ఫెస్టివల్‌లో ప్రదర్శనకు నోచుకుంది. సాధారణంగా శీను రామస్వామి దర్శకత్వం వహించే చిత్రాలను అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ప్రదర్శిస్తుంటారు. ఆ కోవలోనే ఆయన దర్శకత్వం వహించిన 'మామనిదన్' చిత్రం అనేక చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై ప్రశంసలు అందుకుంది. ఇపుడు పుణె ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'ఇడిముళక్కం'లో ప్రదర్శితమైంది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సంగీత దర్శకుడు, ఆ చిత్ర హీరో జీవీ ప్రకాష్‌తో కలిసి దర్శకుడు రామస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ... 'ఈ చిత్రాన్ని ఎమోషనల్‌ను ప్రధానాంశంగా చేసుకుని రూపొందించాను. విడుదలకు ముందే పుణె ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఎంపికైంది. మన దేశంలో జరిగే అన్ని చిత్రోత్సవాలకు ఈ సినిమాను పంపించనున్నట్టు పుణె ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వాహకులు హామీ ఇవ్వడం సంతోషంగా ఉంది' అని అన్నారు.

కిళంబాక్కం సబర్బన్ రైల్వేస్టేషన్ పనులు ప్రారంభం

పెరంబూర్, జనవరి 23: స్థానిక కిలంబాక్కం బస్‌స్టేషన్ సమీపంలో సబర్బన్ రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రించేలా కిళంబాక్కంలో కొత్త బస్ టెర్మినల్ ఏర్పాటైన విషయం తెలిసిందే. దక్షిణ జిల్లాలకు వెళ్లే ప్రభుత్వ, ఆమ్నీ బస్సులు ఈ టెర్మినల్ నుంచి వెళ్తాయని రవాణా శాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో, ప్రయాణికులు ఈ బస్ టెర్మినల్ నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేలా ఎంటీసీ బస్సులు నడుపుతోంది. అలాగే, ప్రయాణికుల సౌకర్యార్థం ఈ ప్రాంతంలో సబర్బన్ రైల్వేస్టేషన్ ఏర్పాటు చేయాలని దక్షిణ రైల్వేకు రాష్ట్ర ప్రభుత్వం కోరింది. అదే సమయంలో రైల్వే స్టేషన్ ఏర్పాటుకు రైల్వే శాఖ నుంచి నిధులు పొందడం ఆలస్యం అవుతుందని భావించిన రాష్ట్రప్రభుత్వం, తొలి విడతగా సీఎండీఏ నిధుల నుంచి నిధులను కేటాయించింది ఈ క్రమంలో కిళంబాక్కం రైల్వే స్టేషన్ ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. మూడు ప్లాట్‌ఫాంలతో రైల్వేస్టేషన్ నిర్మాణాలు సాగుతున్నాయి. చెన్నై బీచ్ నుంచి చెంగల్పట్టుకు వెళ్లే సబర్బన్ రైళ్లు ఈ రైల్వేస్టేషన్ మీదుగా ప్రయాణిస్తాయి. అలాగే బస్ టెర్మినల్ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు ఫ్లై ఓవర్ ఏర్పాటు చేస్తున్నట్లు, ఈ ఏడాది చివరకు పనులు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.


టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న చంద్రశేఖర్ బృందం - లోకేష్ జన్మదిన వేడుకల్లో యువకుల ఉత్సాహం

ఘనంగా లోకేశ్ జన్మదినం

చెన్నై, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు మంగళవారం చెన్నైలో ఘనంగా జరిగాయి. చెన్నై టీడీపీ కార్యాలయంలో నగర టీడీపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ కేక్ కేట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మన్నూరు చలపతి, నేతలు రాజేష్, ఉమాపతి, మోహన్‌నాయుడు, నారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎంజీఆర్ యూనివర్శిటీ టీడీపీ మద్దతుదారులు ఏర్పాటు చేసిన లోకేశ్ జన్మదిన వేడుకలకూ చంద్రశేఖర్ బృందం హాజరైంది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. యువకుల ఉత్సాహం చూస్తుంటే ఏపీలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో తమ పార్టీ విజయం తథ్యమని స్పష్టమైపోతోందన్నారు. పార్టీ కార్యకర్తలకు లోకేశ్ ఎంతో భరోసాగా ఉన్నారని, పాదయాత్ర ద్వారా ఆయన ప్రజలకు ఎంతో చేరువై, వారి కష్టనష్టాలు తెలుసుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంజీఆర్ యూనివర్శిటీ ప్రతినిధి నారాయణ, జస్వంత్, నరేంద్ర, సతీష్, సత్య తదితరులు కూడా పాల్గొన్నారు. కాగా సవితా యూనివర్శిటీలోనూ టీడీపీ మద్దతుదారులు లోకేశ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవీన్, మౌళి, అజయ్, చరణ్‌సాయి, శరత్, వికాస్, మిథిన్ తదితరులు కూడా పాల్గొన్నారు.

కేరళ వెళ్లే రైళ్లకు 'విస్టా డోమ్' కోచ్‌లు


విస్టాడోమ్ కోచ్ లోపలి దృశ్యం

ఐసీఎఫ్, జనవరి 23: ప్రయాణికులు ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ ప్రయాణించేలా కేరళ వెళ్లే రైళ్లలో 'విస్టా డోమ్' కోచ్‌లు అనుసంధానం చేయనున్నట్లు రైల్వేశాఖ అధికారులు తెలిపారు. చెంగోట్టై - పునలూర్ మధ్య సొరంగాలు, లోయలు వంటి ప్రకృతి సోయగాలతో రైలు మార్గం ఉంది. తమిళనాడు - కేరళ రాష్ట్రాలను కలిపే ఈ మార్గంలో అద్దాల పైకప్పు కలిగిన 'విస్టా డోమ్' బోగీలతో కూడిన రైళ్లను నడిపేందుకు రైల్వేశాఖ నిర్ణయించింది. ప్రయాణికులు ప్రకృతి అందాలు ఆస్వాదిస్తూ ప్రయాణించ వచ్చని, రెండు ఇంజిన్లు 14 పెట్టెలతో 30 కిలోమీటర్ల వేగంతో నడిచే ఈ రైలు కొత్త అనుభూతినిస్తుందని అధికారులు తెలిపారు.

రోల్స్‌రాయిస్ నుంచి స్పెక్ట్రా ఎలక్ట్రిక్ కారు



చెన్నైలో రోల్స్‌రాయిస్ స్పెక్ట్రా ఎలక్ట్రిక్ కారును పరిచయం చేస్తున్న కున్ గ్రూపు నిర్వాహకులు

చెన్నై, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): విలాసవంతమైన కార్లు తయారు చేయడంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన రోల్స్‌రాయిస్ కంపెనీ చెన్నై మార్కెట్లో రోల్స్‌రాయిస్ స్పెక్ట్రా పేరుతో ఎలక్ట్రిక్ లగ్జరీ కారును ప్రవేశపెట్టింది. నగరంలో ఓ స్టార్ హోటల్‌లో జరిగిన సమావేశంలో ఆ కారును కున్ గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్ యు వెంకటేష్, ఆ గ్రూపు ప్రధాన డీలర్ వసంతి భూపతి ప్రదర్శింపజేసి వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా కంపెనీ నిర్వాహకులు మాట్లాడుతూ... దక్షిణభారత దేశంలో ఈ ఎలక్ట్రిక్ లగ్జరీ కారు విక్రయాలను ప్రారంభించడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. ఈ కారు రూ.7.5కోట్ల ధరకు లభిస్తుందని తెలిపారు. ఈ కారుకు నాలుగేళ్ల మైలేజీ వారెంటీ, బ్యాటరీకి పదేళ్ల వ్యారెంటీ, రహదారులలో వాహనం ఆగితే తక్షణ మరమ్మతు సేవల అందుబాటులో ఉంటాయని తెలిపారు.

నారాయణి పీఠంలో 10,008 మందికి వస్త్రదానం



వస్త్రదానం చేస్తున్న శక్తి అమ్మ, ఎమ్మెల్యే నందకుమార్

వేలూరు, జనవరి 23: వేలూరు జిల్లా అరియూరులో ఉన్న స్వర్ణాలయం నారాయణి పీఠంలో శక్తి అమ్మ జయంతి వేడుకలను పురస్కరించుకుని మంగళవారం 10,008 మంది పేదలకు వస్త్రదానం జరిగింది. శక్తి అమ్మ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆస్ట్రేలియాకు చెందిన భక్తుడు సైమన్‌తో పాటు పలువురు ముఖ్యులు కూడా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఆనైకట్టు ఎమ్మెల్యే నందకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని పేదలకు దుస్తులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచస్థాయిలో ప్రశంసలు అందుకునేలా నారాయణి పీఠం ఎంతో మానవత్వంతో పేదలకు ఆదుకుంటోందని కొనియాడారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించడం, విద్యాసాయం, వస్త్ర సాయం వంటివెన్నో కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణి ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ బాలాజీ, పీఠం మేనేజర్ సంపత్, నారాయణి ట్రస్టీ సౌందరరాజన్ తదితరులు కూడా పాల్గొన్నారు.

వీఐటీ వర్శిటీలో 'జై శ్రీరామ్' ర్యాలీ



వేలూరు, జనవరి 23: అయోధ్యలో సోమవారం బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమం సందర్భంగా వీఐటీ వర్శిటీలో ప్రత్యక్ష ప్రసారం కోలాహలంగా సాగింది. ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా హిందూ సంస్థలు, బీజేపీ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో, వీఐటీ వర్శిటీలో రాత్రి 10గంటలకు వేలాదిమంది విద్యార్థులు 'జై శ్రీరామ్' అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

విత్తమంత్రి నిర్మలమ్మ వ్యాఖ్యలతో రాష్ట్రానికి చెడ్డపేరు
● కేంద్ర మాజీ మంత్రి చిదంబరం

అడయార్, జనవరి 23: అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం సందర్భంగా తమిళనాడు రాష్ట్రంలోని ఆలయాల్లో సీతారాముల స్వామికి ప్రత్యేక పూజలు, ప్రసాదాల వితరణ చేయొద్దని ప్రభుత్వం మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్టు సాక్షాత్తు కేంద్ర మంత్రిగా ఉన్న తమిళనాడుకు చెందిన నిర్మలా సీతారామన్ ఆరోపించడం రాష్ట్రానికే చెడ్డపేరని కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం అన్నారు. ఆయన మంగళవారం పుదుకోట జిల్లా తిరుమయంలో విలేకరులతో మాట్లాడుతూ... తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఒక తమిళ మహిళ ఇలా దుష్ప్రచారం చేయడం తగదన్నారు. రామాలయం నిర్మాణం, రామ్ లల్లా విగ్రహం ప్రాణప్రతిష్ఠ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని తాము కూడా స్వాగతిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమం జరగుతున్న సమయంలో తమిళనాడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో పూజలు, ప్రసాదాలు యథావిధిగా సాగాయని పేర్కొన్నారు. కానీ, రాష్ట్రంలోని ఆలయాల్లో పూజలు నిర్వహించేందుకు అనుమతి లేదంటూ రాష్ట్రానికి చెందిన ఒక కేంద్ర మంత్రే దుష్ప్రచారం చేయడం ఏమాత్రం తగదని చెప్పారు. అయోధ్య రామాయల నిర్మాణం బీజేపీ ఎన్నికల హామీల్లో ఒకటన్నారు. తమ పార్టీ అగ్రనేత రాహుల్ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్రపై అసోం రాష్ట్రంలో కొన్ని అల్లరి మూకలు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈ దాడి ఎవరి ప్రోద్భలంతో జరిగిందని ఆయన ప్రశ్నించారు. ఈ దాడికి పూర్తి బాధ్యతను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వహించాలని చిదంబరం అన్నారు.


చెన్నై అన్నా అరివాలయంలో డీఎంకే ఎంపీ టీఆర్ బాలు రచించిన 'ది మేన్ అండ్ మెసేజ్', 'మై వాయిస్ ఫర్ ది వాయిస్ లెస్' అనే గ్రంథాల ఆవిష్కరణ సభలో పాల్గొన్న సీఎం స్టాలిన్, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం, సినీ గేయ రచయిత వైరముత్తు, హిందూ పత్రికా ప్రతినిధి ఎన్ రామ్, మంత్రులు

మిగిలిన రూ.114 కోట్ల 'పొంగల్ కానుక'



ఐసీఎఫ్, జనవరి 23: రేషన్‌కార్డుదారులు సరిగ్గా తీసుకోకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పొంగల్ కానుక' పథకంలో రూ.114 కోట్లు మిగిలిపోయాయి. దీంతో ఆ మేరకు నగదును అధికారులు ప్రభుత్వ ఖాతాలో జమ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి పండుగ సందర్భంగా 2.20 కోట్ల బియ్యం రేషన్‌కార్డుదారులకు తలా రూ.1000 నగదు, కిలో పచ్చి బియ్యం, పంచదార, చెరకు గడలను రేషన్ దుకాణాల్లో ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు అందజేసిన విషయం తెలిసిందే. మొత్తం కార్డుదారుల్లో 11.40 లక్షల మంది పొంగల్ బహుమతిని తీసుకోలేదు. దీంతో మిగిలిన నగదు రూ.114 కోట్లను సహకార సంఘ అధికారులు ప్రభుత్వ ఖాతాలో తిరిగి జమ చేశారు.


నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి సందర్భంగా మెరీనా బీచ్‌లో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న మంత్రులు సామినాథన్, అనితా ఆర్ రాధాకృష్ణన్, ఎం.సుబ్రమణియన్, పీకే శేఖర్‌బాబు తదితరులు


చెన్నై క్యాంపు కార్యాలయంలో డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలుసుకున్న లోక్‌సభ ఎన్నికల కోసం ఏర్పాటైన వివిధ కమిటీల సభ్యులు

మేనిఫెస్టో తయారీకి అభిప్రాయ సేకరణ
● కేఎస్ అళగిరి వెల్లడి

అడయార్, జనవరి 23: లోక్‌సభ ఎన్నికల కోసం ఎన్నికల మేనిఫెస్టోను తయారు చేసేందుకు రాజ్యసభ సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో తయారీ కమిటీని ఏర్పాటు చేసిందని, ఈ కమిటీ ఈనెల 25వ తేదీన నగరంలో అభిప్రాయ సేకరణ చేపడుతుందని టీఎన్‌సీసీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి తెలిపారు. ఇదే విషయంపై ఆయన మంగళవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ మేనిఫెస్టో కమిటీలో చిదంరంబతో పాటు అనేక మంది సీనియర్ నేతలు ఉన్నారని, ఈ నెల 25వ తేదీన మధ్యాహ్నం 3.30 గంటలకు ఈ ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటలకు పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీకి చెందిన వివిధ విభాగాలకు చెందిన అధ్యక్షులు, నేతలు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలను సేకరిస్తామని పేర్కొన్నారు.

పళని - తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులు

అడయార్, జనవరి 23: తైపూసం, పౌర్ణమి, రిపబ్లిక్ డే, శని, ఆదివారం... వరుసగా ఐదు రోజుల పాటు సెలువులు రావడంతో చెన్నైతో పాటు రాష్ట్రంలోని ప్రధాన జిల్లా కేంద్రాల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నట్టు తమిళనాడు ప్రభుత్వం రవాణా సంస్థ తెలిపింది. తైపూస వేడుకలు, తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణ భక్తులతో పాటు ఈనెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు వచ్చే వరుస సెలవులకు సొంతూళ్ళకు వెళ్ళే వారి కోసం ఈ బస్సులను నడపనున్నట్టు పేర్కొంది. కుంభకోణం, తంజావూరు, పట్టుకోట, మన్నార్‌కుడి, పుదుక్కోట, రామనాథపురం, రామేశ్వరం, పరమకుడి, మదురై, నాగపట్టినం, వేలాంకణ్ణి, తిరువారూర్ తదితర ప్రాంతాల నుంచి బస్సులను నడిపేలా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా చెన్నై నుంచి కుంభకోణం, తంజావూరు, పట్టుకోట, మన్నార్‌కుడి, నాగపట్టినం, కారైక్కాల్, తిరుచ్చి, అరియలూరు, పెరంబలూరు, కరూర్, పుదుక్కోట, కారైక్కుడి, రామనాథపురం, మదురై, తిరువణ్ణామలై ప్రాంతాలకు, తిరుచ్చి నుంచి తంజావూరు, కుంభకోణం, తిరువారూర్, నాగపట్టినం, పుదుక్కోట, మదురై ప్రాంతాలకు, మదురై, కోయంబత్తూరు, తిరుపూరు ప్రాంతాల నుంచి తిరుచ్చి, తంజావూరు, పుదుక్కోట ప్రాంతాలకు బస్సులను నడపనున్నట్టు పేర్కొన్నారు.